01ATP13F_01ATP13F.qxd 13-04-2026 PM 11:25 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 14 ఏప్రిల్ 2026 పేజీలు : 04


# పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు సౌకర్యాలేవి..?!

-టెంట్లు, నీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ కిట్లు జాడే లేదు

-మండుతున్న ఎండల్లో అష్టకష్టాలు పడుతున్న కూలీలు

-నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఉపాధి అధికారులు

-వ్యవసాయ కార్మిక సంఘాలు ఉద్యమించాలంటున్న కూలీలు





మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు, పని ప్రదేశంలో ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువవ్వడంతో మండుతున్న ఎండల్లో కూలీలు అష్టకష్టాలు పడుతున్నారు. ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోయి 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్న పరిస్థితులు ఉండగా పని ప్రదేశంలో కూలీలు సేద తీరడానికి నిబంధనల మేరకు ఏర్పాటు చేయాల్సిన టెంట్లు, తాగునీరు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్ కిట్ల సౌకర్యాల ఊసే లేకుండా పోతోంది. ఎండ తీవ్రత ఉదయం 8 గంటల నుండే ప్రారంభమవుతుండగా కనీస సౌకర్యాలు కూడా లేని ప్రదేశాల్లోపని చేయడానికి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మారిన నిబంధనల మేరకు ప్రతి కూలీ పని ప్రదేశంలో బయోమెట్రిక్ హాజరు, ఫేస్ యాప్‌లో ఫోటోలు దిగాల్సి ఉండగా అనేక చోట్ల నెట్‌వర్క్ సమస్య కారణంగా కూలీలు పని ప్రదేశానికి, ఇంటికి పలు మార్లు చక్కర్లుకొట్టాల్సి పరిస్థితులునెలకొన్నాయి. ఉదయం 11 గంటల వరకు ఉపాధి కూలీలు ఎండలో పనిచేస్తుండగా అనేక మంది వడదెబ్బ బారినపడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడంలో ఉపాధి హామీ అధికారులవైఫల్యం కూలీలకు శాపంగా మారుతోంది. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారుతప్ప క్షేత్రస్థాయికి వచ్చి ఎండలో తాము పడే ఇబ్బందులను పట్టించుకోవడంలేదని పలువురు కూలీలు వాపోతున్నారు. వేసవి ఎండలో పనిచేసే కూలీలకు ప్రత్యేక అలవెన్స్ ఊసే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనికి 5, 10 వారాలకు ఒకసారి కూడా క్రమం తప్పకుండా కూలీ డబ్బులు ఖాతాల్లో జమ చేయడం లేదని వాటి కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని మండిపడుతున్నారు. చాలా కాలంగా పనిముట్లు కూడా సరఫరా కావడంలేదని ప్రభుత్వం, ఉపాధి అధికారులు మా గోడు పట్టించుకోవాలని కోరుతున్నారు. పని ప్రదేశాల్లో కచ్చితంగా సౌకర్యాలు కల్పించేలా వ్యవసాయ కార్మిక సంఘాలు ఉద్యమించాలని వారు కోరుతున్నారు.

# మహిళల సాధికారతే వికసిత భారత్‌కు బలమైన పునాది

- 33 మహిళా రిజర్వేషన్‌తో కొత్త దిశలో దేశం - నారీ శక్తి వందన్‌తో మహిళల రాజకీయ శక్తివృద్ధి - మంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యాఖ్యలు - నారీ శక్తి వందన్ సమ్మేళన్ ప్రత్యక్ష ప్రసారం వీక్షణలో మంత్రి సత్య కుమార్ యాదవ్





మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సత్తి కుమార్ యాదవ్ , వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**బత్తలపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

బత్తలపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు సోమవారం మహిళలతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి నారీ శక్తి వందన్ సమ్మేళన్ ప్రత్యక్ష ప్రసారాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... దేశంఅభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే చట్టసభల్లో మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అందుకే లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును నరేంద్ర మోదీ నాయకత్వంలో సెప్టెంబర్ 2023లో ఆమోదింపజేయడం జరిగినదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ల అమలు అత్యవసరమని, ఈ నెల 16, 17, 18 తేదీలలో పార్లమెంటులో కీలక చర్చలు జరగనున్నాయని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు అవుతుండటం గర్వకారణమని, వికసిత భారత్ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని మంత్రి స్పష్టం చేశారు. ఈ నారీ శక్తి వందన్ సమ్మేళన్ ద్వారా సమాజంలోని అన్ని వర్గాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, మహిళల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సాధికారతపై అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అదేవిధంగా, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో మహిళలకు 33 రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన్ అధినియమం ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. కుటుంబాన్ని సక్రమంగా నడిపించే మహిళ సమాజాన్ని కూడా ముందుకు నడిపించగలదనే నరేంద్ర మోదీ సందేశాన్ని మంత్రి గారు ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం మహిళా సాధికారతపై దృష్టి సారించడానికి పలు సంక్షేమ పథకాలను అమలు అమలు చేస్తోంది వాటిలో ముఖ్యంగా బేటీ బచావో బేటీ పడావో - బాలికల రక్షణ, విద్య ప్రోత్సాహం, ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన - ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆరోగ్య రక్షణ, సుకన్య సమృద్ధి యోజన - బాలికల భవిష్యత్ కోసం పొదుపు, ప్రధాన్ మంత్రి ముద్రా యోజన - మహిళా వ్యాపారులకు రుణాలు, స్టాండ్ అప్ ఇండియా - మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఈ పథకాల ద్వారా కోట్లాది మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడుతున్నారని మంత్రి తెలిపారు. దేశంలో పేద ప్రజలకు బ్యాంకింగ్ సౌకర్యాలు అందించేందుకు 2014లో ప్రారంభించిన ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది మంది జీరో బ్యాలెన్స్ బ్యాంక్ అకౌంట్లు తెరవబడినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు కూడా బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చి, నేరుగా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో జ్ఞాన వికాసం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ రూరల్ లైబ్రరీ మిషన్ ద్వారా గ్రామీణ యువత, మహిళలకు పుస్తకాలు, డిజిటల్ వనరులు అందించి విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యమని తెలిపారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెంపు, ఆర్థిక సాధికారత, సామాజిక గౌరవం కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశాన్ని వికసిత భారత్ దిశగా ముందుకు నడిపిస్తున్నాయని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆయన ప్రసంగం అనంతరం మహిళా సాధికారత దిశగా ప్రధాని మోదీ గారు తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి మద్దతుగా ప్రతి ఒక్కరూ 9667173333 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు.

# పిజిఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజలతో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామ కృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, పద్మావతి, అఖిల, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 587 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ ఉంచకుండా గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, డిటిసి వీర్రాజు, డిఆర్డిఏ పిడి శైలజ, మెప్మా పిడి విశ్వజ్యోతి, హౌసింగ్ పిడి శైలజ, ఐసీడీఎస్ పిడి శ్రీదేవి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిద్రావస్థలో నిఘా.. గనుల్లో దగా..!

- అడగరులే తవ్వేసేయ్..ఆపరులే తోలేసేయ్..!
- నిర్లక్ష్యపు మత్తులో జోగుతున్న గనులు, రెవెన్యూ శాఖ
- రూ. కోట్లు కొల్లగొడుతున్నా..కన్నెత్తి చూడని యంత్రాంగం
- సొరంగం నిజం..దోపిడీ వాస్తవం..చోద్యం యథార్థం..!



ఈ ఏడాది ఫిబ్రవరి 4న అధికారుల తనిఖీల సందర్భంగా చుట్టూ ఉన్న ఖనిజం



అధికారులు జప్తు చేసిన స్టీటైట్, డోలమైట్ ఖనిజం



నాడు అక్రమ ఖనిజం కదలకూడదంటూ వీఆర్వోను ఆజ్ఞాపిస్తున్న తహసీల్దార్

**తాడిపత్రి, ఏప్రెల్13, ప్రభాతవార్త:**

తాడిపత్రి డివిజన్ భూగర్భ, గనుల శాఖకు సంబంధించి క్రిష్టిపాడు రెవెన్యూ పరిధిలోని కొండుపల్లి గనుల్లో విధ్వంసం యథేచ్ఛగా సాగుతూనే ఉంది. అక్రమ ఖనిజ దందా విచ్చల విడిగా జరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. నిర్లక్ష్యపు మత్తులో జోగుతున్న గనులు, రెవెన్యూ శాఖల కళ్లకు కనిపించడం లేదో..వారికి చీమ కుట్టినట్లైనా లేదో గాని దోపిడీ దారులు ప్రకృతిని కొల్లగొట్టి..మూటలు కూడగట్టుకుంటున్నా చోద్యం చూస్తున్నారు.ప్రకృతి వనరులను అడ్డగోలుగా దోచేస్తున్నా ప్రశ్నించే వారే కరవయ్యారు. ప్రభుత్వ, ప్రజల ప్రయోజనాలకు కూడా ఉపయోగపడాల్సిన ఖనిజ సంపదను కాపాడాల్సిన సంబంధిత అధికారులు వసూళ్లే అజెండాగా భావిస్తూ దందాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొండుపల్లి సమీపంలోని దాదాపు 42 గనుల్లో వేళ్లమీద లెక్కపెట్టగలిగిన వాటిలో మాత్రమే 80 శాతం నిబంధనలు పాటిస్తున్నారు. తక్కిన వాటిలో ఇష్టారాజ్యానిదే పైచేయిగా చలామణి అవుతోంది. అధికారుల బాధ్యతా రాహిత్యానికి, అక్రమార్కుల దగాతనానికి నిలువుటద్దంగా నిలిచే సంఘటన ఒకటి ఇటీవల ఓ అక్రమ గనిలో చోటు చేసుకుంది.

**:అడగరులే తవ్వేసేయ్..ఆపరులే తోలేసేయ్**

పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు రెవెన్యూ పరిధిలోని కొండుపల్లిలో సర్వే నంబర్లు 688,697,698 సబ్ డివిజన్ల భూమిని పరిమి చరణ్, తమ్మినేని శ్రీనివాసులు అనే ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేశారు. ఒక భూమిలో గనుల తవ్వకాలు జరగాలంటే రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ, సర్వే శాఖ నుంచి అప్రూవ్డ్ మైనింగ్ ప్లాన్, గనుల శాఖ నుంచి తవ్వకాలకు అనుమతి, గనుల భద్రత శాఖ నుంచి పేలుళ్లకు అనుమతి, పేలుళ్లను పర్యవేక్షించడానికి ఒక బ్లాస్టింగ్ మేనేజర్, ఖనిజాన్ని తరలించడానికి రాయల్టీ చెల్లింపులు వంటి పెద్ద తతంగమే ఉంటుంది. ఈ భూమిలో పై వాటిలో ఏఒక్కటి లేకుండానేసొరంగాలు తవ్వేశారు.అడిగేదెవరు.. ఆపేదెవరు అంటూ అధికారుల కు సవాలు విసురుతూ ఇక్కడ రెండు పెద్దపెద్ద సొరంగాలు ఏర్పాటు చేసి ఖనిజ దోపిడీకి తెగబడ్డారు. ఏడాదికి పైగా నెలకు సుమారు 500 టన్నుల వంతున విలువైన స్టీటైట్ ఖనిజాన్ని తవ్వి, తరలిస్తున్నా అధికారులు గుడ్లప్పగించి చూశారే తప్ప అడ్డగించిన దాఖలాలు లేవు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి చెల్లించకుండా దాదాపు 6,000-8,000 టన్నుల డోలమైట్, స్టీటైట్‌ను తవ్వి తరలించి సుమారు రూ. 5.6 కోట్లకు పైగా సొమ్ము చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా క్షేత్రస్థాయిలో నిత్యం సంచరించే రెవెన్యూ సిబ్బందికిగాని, గనుల తనిఖీలకు వచ్చినప్పుడు గాని, రాయల్టీలులేకుండా ఈగని నుంచి తరలిపోతున్న ఖనిజం గాని గనుల శాఖ అధికారుల కంట పడకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ తతంగం చూస్తున్న ఇతర గనుల యజమానులకు కూడా అంతుచిక్కని ప్రశ్నలా ఈ గనిలోని తవ్వకాలు మిగిలిపోయాయి.



అక్రమ ఖనిజాన్ని ఊడ్చేసిన అక్రమార్కులు

**:ప్రకృతే పట్టించింది..!**

ప్రకృతిని విచ్ఛిన్నం చేసేలా మనిషి వ్యవహరిస్తే ఆ ప్రకృతే తగిన గుణపాఠం చెబుతుందనేది మనం ఎన్నో సార్లు విన్నాం..చూశాం. అలాంటిదే ఇక్కడా జరిగింది. రాత్రి వేళల్లో ఈ అక్రమ గనిలో పేలుళ్లు సంభవించి ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు కావడంతో జిల్లా వ్యాప్తంగా గుట్టు రట్టయ్యింది. జిల్లా అధికారులు క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంపై కన్నెర్ర చేయడంతో బండారం బహిర్గతమైంది.దీంతో నిర్లక్ష్యపు మత్తులో జోగుతున్న క్షేత్రస్థాయి రెవెన్యూ, గనులు, పోలీసు శాఖల్లో చలనం వచ్చింది. ఫిబ్రవరి 4న తనిఖీలకు వెళ్లిన అధికారులకు సొరంగం నిజం..దోపిడీ వాస్తవం..తమ చోద్యం కూడా యదార్థమని రుజువైంది. అప్పటికే గని వెలుపల నిల్వ ఉంచిన 1,225 టన్నుల ఖనిజాన్ని జప్తు చేసి, అందులో ఒక్క రాయి కూడా కదలడానికి వీలు లేదంటూ తహసీల్దార్ స్థానిక రెవెన్యూ అధికారులను ఆజ్ఞాపించారు. దీనిపై ఒక నివేదికను జిల్లా అధికారులకు కూడా అందజేశారు. అధికారులు వస్తున్నారని తెలుసుకున్న దోపిడీదారులు రాత్రికి రాత్రే ఖనిజ దోపిడీకి వినియోగించిన సామగ్రిని తరలించడం కొసమెరుపు.

**:నిఘా నిద్ర..దగా ముద్ర..!**

నిద్రావస్థలో జోగుతున్న రెవెన్యూ సిబ్బంది తీరును చూసి అక్రమార్కులు మరోమారు చెలరేగి పోయారు. ఆ అక్రమ గని వద్ద అధికారులు జప్తు చేసిన 1,225 రూ. 90 లక్షల విలువ చేసే సుమారు 50 లారీల సరుకును గుట్టుగా అక్కడి నుంచి తరలించారు. ఇదేమని ప్రశ్నించే అధికారులు, సిబ్బంది నోరు నొక్కేశారేమో గాని ఆ మాయమైన ఖనిజం గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయంపై గనుల శాఖ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా వారి నుంచి యథా ప్రకారం మౌనమే సమాధానమైంది. ఇక వీఆర్వో సుదర్శన్‌రెడ్డిని సంప్రదించగా సగం లారీ సరుకు తీసుకొని పోయినట్లు గుర్తించాం. తిరిగి వారి నుంచి ఆ సరుకును తెప్పించామని పేర్కొనడం విశేషం.

# డామిట్ కథ అడ్డం తిరిగింది...!

మర్డర్ చేసి ఆత్మహత్యగా చిత్రీకరణ - చివరకు కటకటాల్లోకి



నిందితున్ని అరెస్టు చేసిన టూ టౌన్ పోలీసులు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన స్వల్ప మనస్పర్థలు దారుణ హత్యకు దారి తీసాయి. తన ప్రియురాలికి అసభ్యకరంగా మాట్లాడినాడని కక్ష మనసులో పెట్టుకొని దాడి చేసి హత్య చేశాడు. ఈ నేరాన్ని తనమీద వేసుకోకుండా రైల్వే పట్టాలపై శవాన్ని పడవేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు అనుమానం వచ్చింది. అయితే ఈ కేసును సీరియస్ గా తీసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞాన సాయంతో ఆత్మహత్య కాదని, ఇది హత్యేనని నిరూపించారు. సుమారు 10 నెలల తర్వాత ఎట్టకేలకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కట్ చేస్తే... రాప్తాడుకు చెందిన మందల కార్తీక్, చంద్రబాబు కొట్టాలకు చెందిన దుర్గాప్రసాద్ ఇద్దరూ స్నేహితులు. ఇద్దరికీ చెడు అలవాట్లు ఉండి, ఇందులో కార్తీక్ తన ప్రియురాలని దుర్గాప్రసాద్ ఫోన్లో దూషించాడని మనసులో పెట్టుకొని గతేడాది మే 27న రాత్రి అనంతపురం టౌన్, బాబా నగర్ రైల్వే ట్రాక్ పై మందల కార్తీక్, దుర్గ ప్రసాద్ లు మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. దుర్గాప్రసాద్ ను రాయితో తలపై కొట్టి హత్య చేసాడు. అనంతరం రైలు పట్టాలపై పడుకోబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించి అక్కడి నుంచి పారిపోయాడు. అయితే తొలుత రైల్వే పోలీసులు అసహజ మరణంగా కేసు రిజిస్టర్ చేశారు. తరువాత అనుమానం వచ్చి అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ కి బదిలీ చేసారు. అనంతపురం డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2 టౌన్ సిఐ శ్రీకాంత్, ఎస్సై రుషేంద్ర బాబు, సిబ్బంది అమరేశ్వర రావు, టి.అంజన్ కుమార్, సుధాకర్, పాండవ, రామాంజనేయులు, వన్నూరు లు సాంకేతి పరిజ్ఞానంతో ఈ కేసును చేదించారు. నేరస్తుడైన కార్తీక్ ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# బాధితులకు సత్వర న్యాయం చేయండి

## పీజీఆర్ఎస్ కు 169 ఫిర్యాదులు జిల్లా ఎస్పీ





ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా వింటున్న ఎస్పీ , పీజీఆర్ఎస్ కు హాజరైన బాధితులు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుండీ 169 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతీ పిటీషన్ ను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ ( ప్రజా సమస్యల పరిష్కార వేదిక ) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండి వచ్చిన ప్రజల నుండీ ఎస్పీ గారు 169 ఫిర్యాదులు స్వీకరించారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారిసమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ముఖ్యంగా భార్యాభర్తలగొడవలు, కుటుంబ సమస్యలు, రస్తావివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఇస్కాన్ వారి సౌజన్యంతో పిటీషనర్లు, వారి వెంట వచ్చిన సహాయకులకు ఉచితంగా భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

02ATP27_02ATP27.qxd 13-04-2026 PM 10:51 Page 1



## సీఎం జన్మదిన వేడుకలకు సేవామయ శోభ..

### రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

### - టీడీపీ సీనియర్ నాయకుడు మోరేపల్లి మల్లికార్జున పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత మోరేపల్లి మల్లికార్జు

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 20న కళ్యాణదుర్గం ప్రజా వేదికలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నేత మోరేపల్లి మల్లికార్జున పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రక్తదానం అనేది కేవలం సేవ మాత్రమే కాదు, ప్రాణాలను కాపాడే మహోన్నత కార్యమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఇది పునర్జన్మనిచ్చే అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు. రక్తదానం చేస్తే బలహీనత వస్తుందనే అపోహలు ప్రజలు విడనాడాలని సూచించారు. వైద్యుల ప్రకారం రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్త కణాలు ఉత్పత్తి అవుతూ ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. రక్తదానం అనేది మనిషి చేయగలిగే అత్యున్నత సేవల్లో ఒకటని, ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడగలదన్నారు. అందుకే "ఈరోజు రక్తదానం – రేపటి ప్రాణ రక్షణ" అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనే ప్రతి రక్తదాతకు రూ.3 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సేవా కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థతో పాటు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొని ఆరోగ్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జన్మదినాన్ని సేవా దృక్పథంతో జరుపుకుంటూ, ఎక్కువ యూనిట్ల రక్త సేకరణ ద్వారా చరిత్ర సృష్టించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు :ఈ నెల 14న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. దళిత సామాజిక వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైపీ రమేష్, టీఆర్ తిప్పేస్వామి, ధనుంజయ, శివన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటి ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా 3వ ర్యాంకు సాధించిన శ్రీ శ్రీనివాస విద్యా నికేతన్ విద్యార్థులు




గజల్ శ్రీనివాసచేతుల మీదుగా అవార్డు అందుకున్న వేముల శ్రీనివాసులు

**బెలుగుప్ప ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

గుంటూరు మెడికల్ కాలేజ్ ఆడిటోరియం నందు ఈ అభ్యాసఅకాడమీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన12వ రాష్ట్రస్థాయి అవార్డులను శ్రీశ్రీనివాస విద్యానికేతన్ బెలుగుప్పవిద్యార్థులు వివిధ పోటీలలోరాణించారు వీరికి గజల్గాయకుడు గజల్శ్రీనివాస్, అత్యున్నతమైన విలువలు మంచిభావాలు కలిగి 5సార్లు ఎమ్మెల్సీగాఎన్నిక కాబడిన లక్ష్మణ రావు వీరి చేతులమీదుగా అవార్డులను విద్యార్థులు అందుకున్నారు. ఇంత చిన్నతనంలోనే విద్యార్థులు గ్రామీణప్రాంతంలో ఐఐటిఫౌండేషన్ మెలకువలు నేర్చుకొని లక్షల మంది విద్యార్థుల తో పోటీపడి రాష్ట్రస్థాయిలోనే మూడవ ర్యాంకు సాధించినందుకు గజల్ శ్రీనివాస్ మరియు ఎమ్మెల్సీ లక్ష్మణ రావు అభినందించారు. ప్రతి సంవత్సరం నూతన ఆలోచనలతో నియమ బద్ధతతో సేవలు అందిస్తున్న శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలను డిఆర్డిఓ సతీష్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## స్వచ్ఛ గ్రామం ఆరోగ్య కరమైన జీవితం



చెత్తను సేకరించి స్వచ్ఛ రథానికి ఇస్తున్న దృశ్యం

**శెట్టూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛరథం" కార్యక్రమం ప్రజల జీవన విధానంలో ముఖ్యమైన మార్పులను తీసుకువస్తోందని పంచాయితీ కార్యదర్శి జగదీష్ పేర్కొన్నారు. చెత్త నిర్వహణ, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ వంటి అంశాల్లో ఈ రథం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.మండల పరిధిలోని ములకలేడు గ్రామంలో సోమవారం పంచాయితీ కార్యదర్శి ఆధ్వర్యంలోప్రారంభించి చెత్తను సేకరించి స్వచ్ఛరథం సిబ్బందికి చేర్చారు.స్వచ్ఛ వాహనంలో ఉన్న నిత్యావసర సరుకులను ఆగ్రామఅధ్యక్షులు రంగపాల్యం గోపాల్ కొనుగోలు చేశారు. అనంతరం పంచాయితీ కార్యదర్శిజగదీష్ స్వచ్ఛ రథం ముఖ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. 1. ఇంటింటికీ చెత్త సేకర ణస్వచ్ఛ రథం ద్వారా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి చెత్తను సేకరించడం జరుగుతోంది. దీంతో వీధుల్లో చెత్త పేరుకుపోవడం తగ్గి గ్రామాలు, పట్టణాలు శుభ్రంగా మారుతున్నాయి. 2. ఆరోగ్య పరిరక్ష ణచెత్త పేరుకుపోవడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుంది. స్వచ్ఛ రథం సేవలతో మలినాలు తొలగిపోవడం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు సహాయపడుతోంది. 3. పర్యావరణ సంరక్ష ణప్లాస్టిక్, తడి చెత్త వేరు చేసి నిర్వహించడం ద్వారా పర్యావరణానికి హాని తగ్గుతోంది. పునర్వినియోగం ప్రక్రియకు ఇది తోడ్పడుతోంది. 4. ప్రజల్లో అవగాహన పెంపు స్వచ్ఛ రథం ద్వారా సిబ్బంది ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. చెత్తను వర్గీకరించిఇవ్వడం, పరిశుభ్రత పాటించడం వంటిఅలవాట్లు పెరుగుతున్నాయి. 5.ఉపాధిఅవకాశాలు ఈకార్యక్రమంద్వారా అనేకమందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. డ్రైవర్లు, శుభ్రత కార్మికులు వంటి వర్గాలకు ఉపాధి కలుగుతోంది. 6. గ్రామీణ అభివృద్ధికి తోడ్పాటు పరిశుభ్రమైన వాతావరణం గ్రామ అభివృద్ధికి సూచికగా మారుతోంది. పర్యాటక అభివృద్ధికి కూడా ఇది సహకరిస్తోంది. స్వచ్ఛ రథం కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేస్తే పరిశుభ్రమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని ప్రజలు కూడా బాధ్యతగా పాల్గొంటే ఈకార్యక్రమం మరింత విజయవంతమవుతుందన్నారు. స్వచ్ఛ గ్రామం – ఆరోగ్యకరమైన జీవితం" అనే లక్ష్యంతో స్వచ్ఛ రథం ముందుకు సాగుతోందని ప్రజలకు తెలిపారు.ఈకార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ టీఆర్.తిప్పేస్వామి, సుబ్బారాయుడు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో ఎంసెట్ ఉచిత కోచింగ్

**కొత్తచెరువు ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎంసెట్ ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభమైనయని కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్లత ఓ ప్రకటనలో తెలిపారు ఈసందర్భంగా ప్రభుత్వకళాశాలలో చదివినవిద్యార్థిని విద్యార్థులకు వారి భవిష్యత్తుదృష్ట్యా ఎంసెట్ ఉచిత కోచింగ్ నిర్వహించబడును ఈ కోచింగ్ ద్వారా విద్యార్థులకు ఇంజనీరింగ్ మరియు మెడికల్ ప్రవేశ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం నాణ్యమైనబోధన అందించబడును బుక్కపట్నం పుట్టపర్తి కొత్తచెరువు మండలాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## మంత్రిని కలిసిన టిడిపి జిల్లా కార్యదర్శి

**హిందూపురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త**



మంత్రి సవితమ్మతో చర్చిస్తున్న వద్దే హనుమప్ప

బీసీ సంక్షేమ శాఖ, జౌళి శాఖ మంత్రి సవితమ్మను సోమవారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి వద్దే హనుమప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రితో హనుమప్ప మాట్లాడుతూ స్థానిక సమస్యలను వివరించారు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. సమస్యలపై మంత్రి సవితమ్మ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని హనుమప్ప అన్నారు. హనుమప్ప వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న కొండూరు వేణుగోపాల్ రెడ్డి

**హిందూపురం టౌన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

హిందూపురం మండలం తూముకుంట గ్రామంలో వెలసిన గ్రామ దేవత సప్పలమ్మ ఆలయం నూతనంగా నిర్మిస్తున్న సందర్భంగా హిందూపురం సీనియర్ నాయకుడు కొండూరు వేణుగోపాల్ రెడ్డి సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు గోపురనిర్మాణం కొరకు 25 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరినవెంటనే స్పందించి విరాళామందించిన కొండూరు వేణుగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, జగన్ మోహన్ రెడ్డి, దేవరాజు, రామాంజి, చంద్రశేఖర్, మూర్తి, పవన్ కుమార్, బీమా, సంజీవరాయప్ప, హనుమంతు, బీరప్ప, అశ్వర్థప్ప, నరసింహమూర్తి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కంబదూరు ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య

**కంబదూరు, ఏప్రిల్ 13, ప్రభాత వార్త**

అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ సోమవారం కంబదూరు మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. నాటుసారా ,కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆయన సూచించారు.మద్యం దుకాణాల్లో అమ్మకాలు సురక్ష యాప్ ద్వారా నిర్వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుళ్లు నాగరాజు, దుర్గ తదితర సిబ్బంది హాజరయ్యారు.

## బిజెపి నేత పాతన్న మాతృమూర్తికి నివాళులర్పించిన కన్వీనర్

**బ్రహ్మసముద్రం ఏప్రిల్ 13 ప్రభాతవార్త**



నివాళులర్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండలం మామడూరు గ్రామానికి చెందిన బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పాతన్న మాతృమూర్తి లింగమ్మ మృతి చెందడం పట్ల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, పాతన్న కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలవాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సోమవారం మామడూరు గ్రామాన్ని సందర్శించి మృతి చెందిన లింగమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బిజెపి నేత పాతన్నను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పాలబండ్ల శ్రీరాములు మాట్లాడుతూ మాతృమూర్తిని కోల్పోవడం పాతన్న కుటుంబానికి తీరని లోటని, వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్ర, ఈరన్న, మూకన్నా, అరుణాచలం, రంజిత్, స్థానిక టీడీపీ, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ

**కనేకల్లు ఏప్రిల్ 13 ప్రభాతవార్త**





కనేకల్ మండలం మాల్యం గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతి, సాహిత్యానికి చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. రామాయణం ద్వారా సమాజానికి ధర్మ మార్గాన్ని చూపిన మహానుభావుడని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మాట్లాడుతూ, గ్రామంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు కావడం గర్వకారణమని తెలిపారు. ఈ విగ్రహం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తాగు నీటి కోసం ..ఖాళీ బిందెలతో నిరసన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న మహిళలు

**కంబదూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కంబదూరు మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీ మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు.గ్రామ సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెలరోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో దూరప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు చేపట్టిన ఆందోళనకు స్పందించిన ఎంపీడీవో సూర్యనారాయణ కార్యాలయం బయటకు వచ్చి మహిళతో మాట్లాడారు. వీలైనంత త్వరగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మహిళలకు హామీ ఇచ్చారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

విజయవాడలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్లు, కోఇంచార్జ్ల బాధ్యతలపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ ఇంచార్జ్లు, కోఇంచార్జ్లు పార్టీకి వెన్నెముకలుగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ, ప్రతి కార్యకర్తలతో సన్నిహితంగా మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ పార్టీ సిద్ధాంతాలను గ్రామాల్లో కార్యకర్తలకు విస్తృతంగా చర్చించాలన్నారు. ప్రతి క్లస్టర్‌లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ వారి విశ్వాసాన్ని పొందాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని మరింత బలోపేతం చేయడంలో అందరూ సమిష్టిగా కృషిచేసి కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్లు కోఇంచార్జ్లు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపండి

### జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



ఫిర్యాదుదారుల సమస్యలను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజలు అందించే అర్జీలపై త్వరితగతిన స్పందించి, నిర్ణీత గడువులోగా చట్ట పరమైన పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు.సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో పాల్గొని జిల్లా ప్రజల నుండి వచ్చిన వివిధ ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ , పోలీసులు తమ సమస్యలను పరిష్కరిస్తారనే భరోసాను బాధితులకు కల్పించే విధంగా అర్జీల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికవివాదాలు, భూసమస్యలు ,ఇతరపలువ్యక్తిగత, సామాజిక సమస్యలపై జిల్లానలుమూలల నుండి విచ్చేసిన ప్రజలతో 80 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, డిటిఆర్ బి ఎయిర్పోర్ట్ సిఐలు లక్ష్మీ కాంత్ రెడ్డి, బొజ్జప్ప లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో ఈత, నీటి ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

### పలు పాఠశాలల్లో నీటి ప్రమాదాలపై చైతన్య సదస్సులు

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

వేసవి సెలవుల్లో నీటి ప్రమాదాల నుండి విద్యార్థులను రక్షించేందుకు ఆరా ఇగ్నైట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఒకే రోజు మూడు వేర్వేరు ప్రాంతాల్లో నీటి ప్రమాదాల నివారణ, రక్షణ జాగ్రత్తలపై పోస్టర్లను ఆవిష్కరించి విద్యార్థులకు చైతన్యం కల్పించారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవిలో పిల్లలు చెరువులు, బావుల వద్దకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి లోతు తెలియకుండా దిగడం ప్రమాదకరమని, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణదుర్గం కేజీసీజీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు త్రివిక్రమారావు, చిత్తయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు జాగ్రత్తలను వివరించారు. కంబదూరు మండలం ములకలేడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు పరమేశ్వరప్ప, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి చిత్తప్ప ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధులు సూచించిన ముఖ్య జాగ్రత్తలు ఇలా ఉన్నాయి: తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా పిల్లలను నీటి వనరుల వద్దకు పంపరాదు, చెరువులుబావుల వద్ద హెచ్చరిక బోర్డులను గమనించాలి, ఈత రాని వారు లోతు తెలియని నీటిలోకి దిగకూడదు, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌పై అవగాహన పెంపొందించు కోవాలి. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లోకేష్, డాక్టర్ రాజేష్, డాక్టర్ శరణ్, రమేష్, హర్ష, ఉమా రెడ్డి తదితరులు, పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వేసవిలో విద్యార్థుల భద్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

## మౌలిక వసతుల కల్పనకై ధర్నా

**గుత్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

గుత్తి పట్టణ శివారు ప్రాంతంలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ గతంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం శూన్యం అయిందన్నారు. రోడ్లు నిర్మించాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో చందు, వన్నూరమ్మ, ఊర్మిళ, పార్వతి, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పయ్యావుల కేశవ్‌పై విశ్వేశ్వరరెడ్డి చేసినవన్నీ అసత్య ఆరోపణలే

### -విలేఖరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు



విలేఖరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

**ఉరవకొండ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌పై మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చేసినవన్నీ అసత్య ఆరోపణలేనని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏఎంసీ ఛైర్మెన్ నరిశెటి విజయభాస్కర్, పార్టీ పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మాజీ ఎంపీపీ కె.జె.కుళ్లాయప్ప, సీనియర్ నాయకులు యేళ్ల తిమ్మప్ప, యర్రగుంట్ల వెంకటేష్ తదితరులు మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్‌ను క్రిమినల్ అని, హత్యలు చేయించారని ఆరోపించడం పూర్తిగా సత్యదూరం అన్నారు. 32సంవత్సరాల రాజకీయజీవితంలో మంత్రిహింసా రాజకీయాలకు దూరంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏనాడూ హింసను ప్రోత్సహించలేదన్నారు. హత్యలే చేయించి ఉంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. క్రిమినల్ రాజకీయాలు ఏ పార్టీలో నడుస్తున్నాయో ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో దాదాపు రెండు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యేను ఇప్పటికే ప్రజలు తిరస్కరించారని తన ఉనికిని కాపాడుకోవడానికే నేడు ఆయన అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు లాంటి ప్రాజెక్టులు తీసుకురావడంతో టీడీపీ పాత్రను ఎవరూ విస్మరించలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయలసీమ ద్రోహి అని చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నాయని అవి రాజకీయ దురుద్దేశంతో చేసిన వ్యాఖ్యలన్నారు. జగన్మోహన్‌రెడ్డి మావిగన్ పేరుతో ప్రజలను గంధరగోళానికి గురిచేస్తున్నారని అమరావతికు దేశమంతా మద్దతునిస్తుంటే ఓర్చుకోలేక ఆయన మాట్లాడుతున్నారని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే అసత్యాలు మాట్లాడటం ఇప్పటికైనా మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, మాజీ ఎంపీటీసీ సుంకన్న, నాయకులు వేల్పుల శ్రీనివాసులు, ఎం.వర ప్రసాద్, చినబోలు గోవిందు, పల్లా నరసింహులు, శంకర సుదర్శన్, గెన్నె వెంకటేశులు, నాగేశ్వరరావు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సమస్యలపై చర్యలు తీసుకోండి

### -ఎమ్మెల్యే పిఏలకు సిపిఎం నాయకులు వినతి

**చిలమత్తూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**




వినతిపత్రం అందచేస్తున్న సిపిఎం నాయకులు

ఎండ తీవ్రత పెరుగుతున్న కొద్దీ చిలమత్తూరు మండలంలో తాగునీటి సమస్య మరింత తీవ్రమవుతోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ సదస్సులో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు బాలాజీ, వీరయ్యలకు పలు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 12 పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో తాగునీటి కొరత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ముఖ్యంగా కోడూరు పంచాయతీ కోటిపల్లిలో పరిస్థితి తీవ్రంగా ఉందని, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గ్రామాల్లో నీటి సరఫరాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించి, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని విన్నవించిన గ్రామస్తులకు డిప్యూటీ ఎంపిడిఒ అజయ్‌భాస్కర్ నిర్లక్ష్యంగా స్పందించడంతో ఆగ్రహించిన ప్రజలు ఎంపిడిఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసనతెలిపారు. వేసవినేపథ్యంలో తమసమస్యను పరిష్కరించాలని కోరితే నీటి పన్ను కడితేనే నీరు వదులుతామని చెప్పడం సరికాదని వాపోయారు. ప్రజాసమస్యలపట్ల అధికారులతీరు ఇదేనాఅంటూ ప్రశ్నించారు. అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పొసిషన్ ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని, వీఆర్‌ఒలు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. మండలంలోని దేమకేతేపల్లి వద్ద ఎన్‌హెచ్-544ఈ కొడికొండ-శిర జాతీయ రహదారిపై కొర్లకుంట నుంచి హైవే పైకి వెళ్లే మార్గం ఎత్తుగా ఉండటంతో పై నుండి వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యని, కొర్లకుంట, డి.గొల్లపల్లి, ఓబులాపురం గ్రామాల ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రమాదాలు నివారించేందుకు తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోడూరు తోపు నుంచి కోడూరు గ్రామం వరకు వేసిన సీసీ రోడ్డు ప్రక్కన మట్టి తోలిచదును చేసినప్పటికీ, వర్షాలు పడితే అది కొట్టుకుపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రోడ్డుకు ఇరుపక్కల మట్టి బలంగా వేయించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మినారాయణ, సిపిఐ మండల కార్యదర్శి గోవింద్‌రెడ్డి, పాల్గొన్నారు.

## 20 ఏళ్లయినా ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కరువు

### -ఎంపిడిఓ కార్యాలయం ముందు సిపిఐ నిరసన

**లేపాక్షి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**



ఎంపిడిఒకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

లేపాక్షి మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు కావస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శి గౌతమ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపైనే నిలుస్తోందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి డ్రైనేజీల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ఎంపిడిఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్ల పొడవునా నిలిచి చెరువులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల గర్భవతులు, చిన్నపిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. ఎన్నోమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

**ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపాలి :** స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కాలనీలో డ్రైనేజీ పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశప్ప, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, బి.కె. రాధ, గంగమ్మ, రుసీమభాను, ముంతాజ్, షాకిర, రుక్సానా, నాగమణి, రాజా, రుక్మిణి, మంజులనాయక్, తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

# మీ పిల్లలను ఇలానే చూసుకుంటారా..

## - సంక్షేమ శాఖ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించకపోవడంపై మీ పిల్లలను కూడా ఇలానే చూసుకుంటారా అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, బిసి సంక్షేమశాఖ హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కదిరి మున్సిపల్ పరిధి లోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఉన్న బిసి సంక్షేమ హాస్టల్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులకు వండిన భోజన నాణ్యతను పరిశీలించారు. సంక్షేమ హాస్టల్ పరిసర ప్రాంతాలను అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. పరిస రాలు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు విద్యార్థులకు వడ్డించే భోజనం నాణ్యతగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలను కూడా ఇలానే చూసుకుంటారా, ఇలాంటి భోజనం వడ్డిస్తారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాం లో సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంపై పేద విద్యార్థులకు విద్యను దూరం చేయకూడదన్న లక్ష్య ంతో కార్పోరేట్ స్థాయి విద్యను అందించడంతోపాటు సం క్షమ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారాన్ని అంది ంచాలన్న లక్ష్యంతో ముందుకు పోతోందని ఇందుకు నాణ్యతతో కూడిన భోజనాలు వడ్డించడంతోపాటు మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేకపోవడంపై జిల్లా అధికారికి దృష్టికి తీసుకెళ్లి బిసి సంక్షేమ హాస్టల్‌లో అన్ని రకాల చర్యలు తీసుకోవడంతోపాటు నాణ్యతతో కూడిన భోజనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు ఉన్నారు.

# నిరుపేదలకు న్యాయం చేయండి

## - కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన భారత కార్మిక సంఘాల సమాఖ్య నేతలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి గ్రామ పొలం సర్వే నెంబర్ 2136 లెటర్ ప్రభుత్వ భూమిలో పేదలు నివశించుచున్నారు. వీరందరూ చిన్న చిన్న కూలి పనులు చేసుకుని బతుకుతున్న నిరుపేదలు వారిని ప్రస్తుతం అధికారులు ఖాళీ చేయాలని భయాందోళనకుల గురి చేస్తున్నారని వారికి వెంటనే న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. సోమవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కి మెమోరాండాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరందరూ కొన్ని సంవత్సరాలుగా చిన్న చిన్న షెడ్‌లు వేసుకుని వారి కుటుంబాలు వారి పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. వీరందరికి ఎక్కడా సొంత గృహాలు కానీ, భూములు కానీ ఎటువంటి వ్యక్తిగత ఆస్తులు లేని నిరుపేదలు. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ భూమిలో పేదలు అక్రమంగా నివశించుచున్నారని వారిని ఖాళి చేయించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలుపుతుండడంతో తీవ్ర భయాందోళనకు గురికావడంతో ప్రజలు హైకోర్టును ఆశ్రయించడం (రిట్ పిటిషన్ నెంబర్ : డబ్ల్యూపి/8464/2026) జరిగినది. వీరందరూ గత కొన్ని సంవత్సరాలుగా అర్బన్ రూరల్ తహశీల్దార్‌కి, అనంతపురం ఆర్డీవోకి, గతంలో ఉన్న జిల్లా కలెక్టర్‌కి ఇళ్ల పట్టాలివ్వమని అర్జీలు ఇచ్చారు. అయినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదు. కావున దయచేసి ఈ పేదల మీద దయ ఉంచి తమరు ఈ విషయం మీద వెంటనే స్పందించి గౌరవ హైకోర్టు వారికి ప్రజల తరపున పాజిటివ్‌గా కౌంటర్ ఫైల్ వేస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, భయాందోళనకు గురి కాకుండా అక్కడే నివశించే విధంగా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, నగర అధ్యక్షులు దావీదు, అరుణోదయ నాయకులు చంద్రప్ప, ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్ శెట్టి, రాందాస్, ఈశ్వరయ్య, మాబు, నరసప్ప దాదుబీ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ఫౌండేషనల్ లెర్నింగ్ సర్వే-2026



మాట్లాడుతున్న డిసిఇబి కార్యదర్శి గంధం శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా 3వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయి ఫౌండేషన్ లర్నింగ్ సర్వే-2026 నిర్వహణలో భాగంగా అనంతపురం జిల్లాలో 14 మండలాల్లో, 33 పాఠశాలలను ఎంపిక చేయబడిన డీసీఇబీ కార్యదర్శి శ్రీగంధం శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈనెల 16, 17 తేదీలలో ఎంపిక చేయబడిన ఈ 33 పాఠశాలల్లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థులుకు పకడ్బందీగా సర్వే నిర్వహించబోతున్నామన్నారు.

ఈ సంవత్సరం ఎఫ్ఎల్ఎస్- 2026 సర్వే ట్యాబ్ ఆధారిత పరీక్షలు ద్వారా జరుపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో ఎఎంఒ వేణు గోపాల్, ఎఫ్ఎల్ఎస్ -2026 జిల్లా సమన్వయకర్తలు ఆనంద, భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు. జి ల్లా వ్యాప్తంగా ఈనెల 16, 17 తేదీలలో ఎంపిక చేయ బడిన 33 పాఠశాలల్లో నిర్వహించబోతున్న సర్వే నకు, సంబంధిత మండల అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంద రూ సహకరించాలని రాష్ట్రంలోనే అనంతపురం జిల్లాను సర్వే నిర్వహణలో అగ్రస్థానంలో నిలపాలని డీసీఇబీ కార్యదర్శి శ్రీగంధం శ్రీనివాసులు తెలియజేశారు.

# యస్వీ డిగ్రీ,పిజి కళాశాలలో అంబెడ్కర్ జయంతి వేడుకలు



అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

స్థానిక యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా అంబెడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఎ.వి.ప్రసాద్ ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆలోచనలు ప్రతి విద్యార్థికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం గురించి ఆయన చేసిన కృషిని గుర్తు చేశా రు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ.. యువత అంబేద్కర్ గారి సిద్ధాంతాలను అనుసరించి సమాజంలో మార్పు తీసుకురావాలని సూచిం చారు. చివరగా, సమాజంలో సమానత్వం మరియు ఐక్యతను పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓలు జి.ఆనంద్ బాబు,టి.సుదర్శన్ రెడ్డి,అధ్యాపకులు రాజేష్,జగదీశ్ తదితరులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయి విజ్ఞాన్ పాఠశాలలో అంబేద్కర్ జయంతి వేడుకలు



అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

స్థానిక 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో మంగళవారం సెలవు కారణంగా ముందుగా సోమవారమే డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాఠశాల డైరెక్టర్లు ఎం.పి.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్య రామ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆధునిక భారతదేశ నిర్మాత, సంఘ సంస్కర్త, భారత రాజ్యాంగ పితామహుడు అని చెప్పారు. అంట రానితనాన్ని రూపు మాపడానికి దళిత హక్కుల కోసం మహాద్ సత్యాగ్రహం వంటి ఉద్యమాలు చేశారు. అంబేద్కర్ ఆశయాలు, ఆయన బోధించిన "విద్యసంఘటితంపోరాటం" నేటి తరానికి ఆదర్శం.ఆయన కృషికి గుర్తింపుగా భారతరత్న అవార్డు లభించింది. ఏటా ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని జరుపుకుంటాము అని తెలిపారు.

# మాంఛూ ఫెర్రర్‌ను కలిసిన నదీం - ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ హర్షణీయం



మాంఛోఫెర్రర్‌కు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరిస్తున్న నదీం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటి)కి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయడం శుభపరిణామమని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (ఐహెచ్ఆర్) జాతీయ ఉపాధ్యక్షులు షేక్ నదీం హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజల తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నదీం మాట్లాడుతూ.. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 1969లో ఆర్డీటిని స్థాపించి గ్రామీణ వర్గాల సాధికారత, నిరుపేదలకు సేవ కోసం నిరంతర కృషి సాగించారని చెప్పారు. అన్నే ఫెర్రర్, మాంఛూ, విశా ఫెర్రర్ నిబద్ధతతో విద్య, వైద్యం, బాలల సంక్షేమం, మహిళా సాధికారత, వికలాంగుల పునరావాసం, పర్యావరణ పరిరక్షణ, క్రీడారంగాల్లో చెరగని ముద్ర వేశారని వివరించారు. బత్త లపల్లి ఆసుపత్రి, అనం తపురం స్పోర్ట్స్ అకా డమీ, పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ చాలా కీలకమ న్నా రు. ఉమ్మడి అనంత పురం జిల్లాలో అత్యంత వెనుక బడిన గ్రామాలలో, పేద ప్రజలకు వైద్యం, విద్య, ఇతర మౌలిక వసతులు కల్పిస్తూ ఎనలేని సేవలు అందిస్తోందని తెలిపారు.

# విద్యార్థిని ఎం.గౌతమిబాయికి అవసరమైన సీపీ చెయిర్



విద్యార్థిని ఎం.గౌతమిబాయికి అవసరమైన సీపీ చెయిర్‌ను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా, బెలుగుప్ప మండలానికి చెందిన 7వ తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలున్న విద్యార్థిని ఎం.గౌతమిబాయికి అవసరమై న సీపీ చెయిర్‌ను కలెక్టర్ కార్యా లయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ టి.శైలజ, ఐఈడీ కోఆర్డినేటర్ ఫణిరాజ్ విద్యార్థినికి చెయిర్‌ను అందించారు. ఈ సందర్భంగా బెలుగుప్పకు చెందిన ఐఈడీఎస్ బి.వనిత, ఐఈఆర్టీ బి.లక్ష్మినారాయణ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యాభ్యా సంలో సౌలభ్యం కల్పించేందుకు ఈ చెయిర్ ఉపయోగ పడుతుందని అధికారులు తెలిపారు.

# గురుకుల పాఠశాల ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించిన కమ్మగుట్టపల్లె పాఠశాల విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులు వీరే

నంబులపూలకుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ఫలితాలు-2026లో ఎన్‌పికుంట మండలం, కమ్మగుట్టపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. 8 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడంతోపాటు స్టేట్ ర్యాంకులు వరుసగా 7, 15, 28, 33 సాధించారు. కమ్మగుట్ట పల్లె పాఠశాలలో చదువుతున్న కత్తువారి జగదీష్ స్టేట్ 7వ ర్యాంకు కాకునూరు పార్థు 28వ ర్యాంకు సాధించారు. పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులు జయప్రతాప్, మధన్ ప్రతాప్‌రెడ్డిలను ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డిలు అభినందించారు.

# ప్రశాంతంగా ముగిసిన కావమ్మ-మారయ్యల తిరుణాల ఉత్సవాలు

నంబులపూలకుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

నుంబుల పూలకుంట మండలం కొత్తరోడ్డు వద్ద మూడు రోజులు పాటుజరిగిన కావమ్మ-మారయ్యల తిరణాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం రాత్రి జరిగిన తిరణాల ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొని కావమ్మ మారయ్యేలకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కావమ్మ మారయ్య తిరుణాల ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై కృష్ణమూర్తి పోలీసులను నియమించి ప్రశాంతంగా ఉత్సవాలు ముగింపు కావడంతో ఆలయ నిర్వాహకుడు శ్రీధర్ పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన ఎరా స్కూల్ విద్యార్థిని

## - అభినందించిన చిరంజీవిరెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న చిరంజీవిరెడ్డి

అనంతపురం సిటీ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

న్యూ ఢిల్లీలో నిర్వహించిన సిల్వర్‌జోన్ ఒలంపియాడ్ పరీక్షలలో ఎరా ఇంటర్నేషనల్ విద్యార్థి ప్రతిభ కనబర్చి 3వ ర్యాంకును సాధించారు. సిల్వర్ జోన్ ఒలంపియాడ్ ఇంగ్లీష్ పరీక్షలో రాచానపల్లి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి సాయి ఆదిత్య 3వ ర్యాంకును సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం సోమవారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలఫౌండర్ చిరంజీవిరెడ్డి మాటా ్లడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని సూచించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల ప్రతిభ ప్రదర్శించడానికి దోహద పడుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రత్యూష గాయత్రిలు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

## - అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్




అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. సోమవారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఎంపిడిఓ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ వివిధ శాఖల అధికారలుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తన దృష్టికి రాకూడదని, నిధులు ఎంతవరకైనా ఖరుచ పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ పోలప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జెసి ఇరిగేషన్ ఇంజినీర్ మహేష్ వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు డా.బి. ఆర్. అంబేద్కర్ జయంతి

## - ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



జయంతి సందర్భంగా వివిధ రకాల విద్యుత్ దీపాల వెలుగులో అంబేద్కర్ విగ్రహం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత, డా.బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సం క్షేమ శాఖ ఇన్చార్జి డిడి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ ఎదురుగా ఉన్న డా.బి. ఆర్. అంబేద్కర్ విగ్రహము వద్ద ఉదయం 9.30 నిమిషములకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులచే పూల మాలాంకరణతో కార్యక్రమము జరుగుతుందన్నారు. ఆ తర్వాత ఉదయం 10.30 గంటలకు ప్రజా పరిషత్‌లోని డిపిఆర్సి మీటింగ్ హాలులో సమావేశము నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సోమవారం పూర్తి చేశామన్నారు. కావున జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, జిల్లా ప్రజలు విచ్చేసి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

# పొదుపు మహిళల సమస్యలు వెంటనే పరిష్కరించాలి సిఐటియు డిమాండ్

అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలు, వెలుగు విఓఏలు, పొదుపు సంఘాల మహిళల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేసింది. సోమవారం అనంతపురం నగరంలోని రెండవ రోడ్డులో ఉన్న పార్క్ వద్ద నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, పొదుపు మహిళల స్వేచ్ఛను హరించే విధంగా అమలు చేస్తున్న ఎంసిపి ఎన్సిపి విధానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విఓఏలు, ఆర్పీలకు కనీస వేతనాలు తక్షణమే చెల్లించాలి. 3-4 నెలల వేతన బకాయిలు, 2 సంవత్సరాల స్త్రీనిధి ఇన్సెంటీవ్స్ చెల్లించాలి. ఎంసిపి. ,ఎన్సిపి విధానాలను రద్దు చేసి పాత విధానం కొనసాగించాలి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, యూనియన్ అధ్యక్షురాలు ఎం. నాగమణి, ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, ఆర్పీ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, శాంత, రమాదేవి, సునీత, విఓఏ నాయకులు షాబిరా, రామకృష్ణ తదితరులు, ఆర్పీలు, విఓఏలు, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి లక్ష్యం

## - ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కందికుంట



ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సోమవారం పేర్కొన్నారు. కదిరి రూరల్ మండ లంలోని కొండమనాయుని పాళ్యంలో ఎన్‌హెచ్ఎం పథకం కింద రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందకు పోతోంద న్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందు బాటులో ఉండి మె రుగైన వైద్య సౌకర్యాలు అందించాలని సూచించారు. కార్యక్ర మంలో రూరల్ మండల కన్వీనర్ సొసైటీ ప్రెసిడెంట్ నాగూరు శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మెప్మా ఆర్పీలు, వెలుగు విఓఏలు, పొదుపు మహిళల సమస్యలు వెంటనే పరిష్కరించాలి - సిఐటియు డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

అనంతపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలు, వెలుగు విఓఏలు, పొదుపు సంఘాల మహిళల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేసింది. సోమవారం అనంతపురం నగరంలోని రెండవ రోడ్డులో ఉన్న పార్క్ వద్ద నుండి తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. పొదుపు మహిళల స్వేచ్ఛను హరించే విధంగా అమలు చేస్తున్న ఎంసిపి/ఎన్సిపి విధానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు తమ కష్టార్జిత పొదుపు డబ్బులను సంవత్సరంలో ఒకసారి మాత్రమే వినియో గించుకోవాలని పెట్టిన నియంత్రణలు పూర్తిగా అన్యా యమని, దీనివల్ల మహిళల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని పేర్కొన్నారు. పొదుపు మహిళల డబ్బులపై ఎవరూ పెత్త నం చేయకూడదని, పాత విధానాన్ని కొనసాగించి సం ఘాల స్వయం నిర్ణయాధికారాన్ని కాపా డాలని డిమాండ్ చేశారు. మెప్మా ఆర్పీలు, వెలుగు విఓఏలకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెం టనే చెల్లించాలని, ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచక పోవడం దురదృష్టకరమని తెలిపారు. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. అదేవిధంగా, స్త్రీనిధి ఇన్సెంటీవ్స్ రెండేళ్లుగా చెల్లించకపోవడం, స్వావలంబన, అభయ హస్తం, మహిళా మార్టుల్లో పెట్టిన పెట్టుబడులను తిరిగి చెల్లించకపోవడం వల్ల మహిళలు తీవ్ర నష్టపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్పీలు, విఓఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత, ప్రమోష న్లు కల్పించాలని, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సంబ ంధం లేని యాప్లలో పని చేయించకుండా పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. పొదుపు మహి ళలకు 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్క రించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు హెచ్చరించింది. ఈ కార్య క్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం. నాగమణి, ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, ఆర్పీ యూనియన్ నాయకులు లక్ష్మిదేవి, శాంత, రమాదేవి, సునీత, విఓఏ నాయకులు షాబిరా, రామ కృష్ణ తదితరులు, ఆర్పీలు, విఓఏలు, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియంస్కూల్ కిబెస్ట్‌ఎడ్యుకేషనల్ ఫెసిలిటీస్ అవార్డు




బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫెసిలిటీస్ ప్రశంసాపత్రం




అవార్డును అందు కుంటున్న పాఠశాల మేనే జ్మెంట్ ప్రతినిధి పి. ప్రతాప్ రెడ్డి

శింగనమల ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మండలపరిధిలోని హైదరాబాద్‌ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యారంగంలో విశిష్టప్రతిభకనబరిచి 2026 సంవత్సరానికి గాను నేషనల్ స్కూల్ అవార్డు సమిట్లో బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫెసిలిటీస్ అవార్డును అందుకుంది.ఈ ప్రతిష్టాత్మక అవార్డును బెంగళూరులో నిర్వహించిన నేషనల్ స్కూల్ అవార్డు సమిట్ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధి పి. ప్రతాప్ రెడ్డి స్వీకరించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల మధ్య ఈ అవార్డు పొందడం పాఠశాలకు గర్వకారణ ంగానిలిచింది. విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు, డిజిటల్ క్లాస రూమ్‌లు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా వసతులు మరియు సృజనాత్మక కార్యక్రమాలు అందిస్తూ పాఠశాల ముందంజలో నిలుస్తోంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధచూపడం ఈఅవార్డుకు ప్రధాన కారణం గానిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉత్తమమైన విద్యావాతావరణం కల్పించడం మాలక్ష్యం. ఈ అవార్డుమా కృషికి గుర్తిం పుగా భావి స్తున్నాంఅని జీఎం రామసుబ్బారెడ్డి, ఏజీఎం శంకర్ నారాయణ తెలిపారు.ఈ విజయంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మరియు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

# కెఎస్ఎన్ కళాశాలలో స్త్రీ శక్తి కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కెసి.సత్యలత



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినీలు

అనంతపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ శక్తి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.కెసి.సత్యలత అధ్యక్షత వహించారు. విద్యార్థినీల సాధికారత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. అందులో భాగంగా మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీలు స్త్రీ శక్తి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సి పాల్ డా.కె.సి.సత్యలత మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుంజలో ఉండాలని తమ సామర్థ్యాన్ని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా భద్రత, ఆరోగ్యం, విద్యాప్రధా న్యత, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. అదే విధంగా స్త్రీ శక్తి ప్రధాన ఉద్దేశ్యం అయిన 2023 మహిళా రిజర్వేషన్, మహిళా సంక్షేమ పథకాల మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు మేరీ మధురి, ఐ క్యూ ఎసి కోఆర్డినేటర్, పర్వీన్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరంగయ్య, ధనలక్ష్మి, సౌగంధిక, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించాలి - జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



పోస్టర్లు విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త

నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను, బ్రోచర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. సురక్షిత పాఠశాలలు, సురక్షితమైన ఆసుపత్రులు మరియు అగ్ని మాపక భద్రతపై స్పృహ ఉన్న సమాజం మండలంలో నివారించడానికి కలిసి పనిచేస్తాయి అనే థీమ్ తో అగ్ని మాపక వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోంది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని మాపక వారోత్సవాల్లో అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. గృహా లు, వంటింట్లో జాగ్రత్తలు, స్కూల్, హాస్టల్స్ షాపింగ్ మాల్స్‌లో జాగ్రత్తలు, గోదాములు, గిడ్డంగులు, తాత్కాలిక నిర్మాణ ములు, గ్రామీణ ప్రాంతాల్లో, కర్మగారాలలో అగ్ని ప్రమాదాల సమయంలో పౌరుల సంబం ధీకులు పాత్ర, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, పద్మావతి, ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, జిల్లా ఫైర్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

